క్లుప్తంగా

జిల్లా న్యాయమూర్తి రాజగోపాల్‌కు సన్మానం



సన్మానిస్తున్న ఆర్యవైశ్య, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ జిల్లా అదనపు కోర్టు ప్రారంభోత్సవానికి విచ్చేసిన సందర్భంగా జిల్లా న్యాయమూర్తి గుంత రాజగోపాల్‌ను మంగళవారం జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు మాశెట్టి ఇందిరా అనంత రాములు తన గృహంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు పాలిశెట్టి లక్ష్మీనరసింహారావు, కౌన్సిలర్ ఓరుగంటి నాగేశ్వరరావు, అడ్వకేట్ ఉప్పల గోపాలకృష్ణ మూర్తి, గొండ్రియాల అశోక్, ఏలూరి రాంబాబు, గుండా శ్రీను, పాపారావు, ఉపేందర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఉత్తమ్‌కు సత్కారం



ఎంపీ ఉత్తమ్‌ను సన్మానిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : ఏఐసీసీ కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యుడిగా ఎన్నికైన టీపీసీసీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ కెప్టెన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డిని మంగళవారం పట్టణ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ కోలపూడి యోహాన్, వార్డ్ ఇన్‌చార్జ్ లచ్చుమళ్ల నాగేశ్వరావు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హస్తకళలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థులు

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం కేవీకే ఆధ్వర్యంలో హస్తకళలపై సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థినులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంబ్రాయిడరీ, టై అండ్ డై, పేపర్ కప్స్, బోటిక్, అభరణాలు ఎలా తయారు చేయాలో నేర్పించారు. దుస్తులకు వచ్చే లేబుల్స్‌లో ఉండే చిహ్నాలు ఎలా గుర్తించాలో తెలిపారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు స్నేహ, శ్వేత, సింధూజ, అక్షిత, హరిత, మధుమిత, రజిత, నాడిన్, పుష్ప, ఉపాధ్యాయులు ఉన్నారు.

హుండీ లెక్కింపు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరాహ లక్ష్మీనరసింహ వేణుగోపాలస్వామి దేవాలయం హుండీలను మంగళవారం మిర్యాలగూడ ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ ఈ.రమేష్ పర్యవేక్షణలో లెక్కించారు. ఐదు నెలల హుండీలలో రూ.34,499 ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ గందు సైదులు, ఈఓ ఎంపీ లక్ష్మణ్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తలు కుషల్, గురవయ్య, పవన్ కుమార్, ఆలయ సిబ్బంది గోవిందరెడ్డి, కిరణ్‌గౌడ్, రమేష్, ఉపేందర్, గోపాలకృష్ణ, ఆలయ అర్చకులు ముడుంబై హరీష్‌కుమారాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మాక్ పోలింగ్



మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని అమరవరం ప్రాథమిక పాఠశాల, శ్రీనివాసపురం ప్రాథమికోన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల హెచ్‌ఎంలు శ్రీనివాస్‌రెడ్డి, చిక్కుళ్ల గోవిందు మాట్లాడుతూ ఎన్నికలపై అవగాహన కల్పించడానికి విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయకుమార్, పురుషోత్తమరావు, సోమశేఖర్, సైదాభి, రామ్మూర్తి, రవికిషోర్, మాస్టర్ వేణు, తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి సహకరిస్తానని హామీ



పిల్లుట్ల రఘుతో కమిటీ సభ్యులు

హుజూర్‌నగర్ : మండలంలోని మట్టపల్లిలో సేవాలాల్ అన్నదాన సత్రం ప్రహరీ నిర్మాణానికి తనవంతు సహకరిస్తానని ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు హామీ ఇచ్చారు. మంగళవారం సేవాలాల్ మట్టపల్లి అన్నదాన సత్ర కమిటీ సభ్యులు హుజూర్‌నగర్‌లో పిల్లుట్ల రఘును కలిశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ, సత్ర నిర్మాణ చైర్మన్ బి.జగన్ నాయక్, అడ్వకేట్ నగేష్ రాథోడ్, కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, భీముడు, నాగరాజు, డాక్టర్ జిలేంద్రుడు, న్యాయవాదులు పాల్గొన్నారు.

కుక్కల నియంత్రణకు చర్యలేవీ !

- నేరేడుచర్లలో వీధి కుక్కల స్వైర విహారం
- ఒక్కరోజే 13 మందిపై దాడి
- బెంబేలెత్తుతున్న ప్రజలు



నేరేడుచర్ల మున్సిపాలిటీలోని వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు



కుక్కకాటుతో గాయపడిన మహిళ (ఫైల్)

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని వీధుల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మున్సిపాలిటీలోని 15 వార్డుల్లో దాదాపు 200 నుంచి 300 కుక్కలు సంచరిస్తున్నాయి. ఇప్పటికే కుక్కలు పలువురిని గాయపరచడంతో వారు ఆస్పత్రుల పాలయ్యారు. ఈనెల 11వ తేదీన ఒకే రోజు 13 మందిని వీధి కుక్కలు కరవడంతో పట్టణ ప్రజలు హడలెత్తిపోతున్నారు. కుక్కలను నియంత్రించాలని మున్సిపాలిటీ అధికారులకు ప్రజలు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. గతంలో ఇదే తరహాలో కుక్కలు రోడ్ల వెంట వెళ్లే వారిపై దాడులు చేసి గాయపరచడంతో మున్సిపాలిటీ నుంచి గత ఆరు మాసాల క్రితం లక్షన్నర రూపాయలు వెచ్చించి కుక్కలను పట్టే వారిని పిలిపించి పట్టించి దూరపు ప్రదేశాలలో వదిలివేశారు. అయినా అందులో కొన్ని తిరిగి వచ్చి వాటి సంతతితో మరిన్ని పెరిగాయి. జంతు సంరక్షణ చట్టం ప్రకారం కుక్కలను చంపకూడదని వాటిని మున్సిపల్ సిబ్బంది ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నా సమస్య మాత్రం ఎప్పటి మాదిరిగానే ఉంటోంది. పగలు, రాత్రి వేళల్లో ఒంటరిగా వెళ్తున్న విద్యార్థులు, మహిళలపై వీధి కుక్కలు దాడులు చేస్తున్నాయి. ఇంటి పరిసర ప్రాంతాల్లో ఆడుకుంటున్న చిన్నారులను కరిచిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా కుక్కల బారి నుంచి కాపాడాలని ప్రజలు మున్సిపల్ అధికారులు, పాలకవర్గాన్ని కోరుతున్నారు.

కుక్కల బెడదను నివారించాలి



నేరేడుచర్లలో గత కొన్ని రోజులుగా కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. రోడ్లపై వెళ్లే వారిపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. దీంతో బజారుకు వెళ్లాలంటేనే భయంగా ఉంటుంది. ఈ విషయమై మున్సిపల్ అధికారులకు పలుమార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదు.

– ఆర్.రాజు, నేరేడుచర్ల

చర్యలు తీసుకుంటాం



మున్సిపాలిటీ పరిధిలో పాదచారులపై కుక్కలు దాడి చేస్తున్న విషయం తన దృష్టికి వచ్చింది. కుక్కలు పట్టేవారిని పిలిపించి వాటిని దూరపు ప్రదేశాల్లో వదిలివేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. త్వరలోనే పట్టణ వాసులకు కుక్కల బెడద నుంచి విముక్తి కలిగే విధంగా చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, నేరేడుచర్ల

అధికారులు నిబద్ధతతో పనిచేయాలి

- కలెక్టర్ వెంకట్రావ్



తహసీల్దార్ కార్యాలయ రికార్డులు తనిఖీ చేస్తున్న కలెక్టర్

హుజూర్‌నగర్ : అధికారులు నిబద్ధతతో పనిచేసి ప్రజలు, రైతులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ సూచించారు. హుజూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గృహలక్ష్మి అమలు తీరు, ధరణి ఫైల్స్, కార్యాలయ రిజిస్టర్లను ఆయన పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై కార్యాలయానికి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ నాగార్జునరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సత్వర న్యాయం జరిగేలా చూడాలి

- ఎస్పీ రాజేంద్రప్రసాద్



మఠంపల్లి పోలీస్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

మఠంపల్లి : పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం మఠంపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది పరిస్థితులకు అనుకూలంగా పనిచేయాలని ఆదేశించారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ బాలకృష్ణ, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పేదల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న పేదలు

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో నేరేడుచర్ల ప్రధాన కూడలి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు పేదలు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం హుజూర్‌నగర్ కన్వీనర్ వాస పల్లయ్య మాట్లాడుతూ గత కొన్ని ఏళ్లుగా ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ధర్నాలు, నిరహార దీక్షలు, వినతులు ఇచ్చినా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో వాస కరుణాకర్, హుస్సేన్, మరియమ్మ, దుర్గమ్మ, మట్టయ్య, రంగయ్య, లక్ష్మమ్మ, మంగమ్మ, తదితరులు ఉన్నారు.

రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

మునగాల : రుణమాఫీ జరిగిన రైతులకు బ్యాంకులు కొత్త రుణాలు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బుర్రి శ్రీరాములు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ వి.ఆంజనేయులుకు ఆయన రైతు సంఘం నాయకులతో కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల బ్యాంక్ ఖాతాలు నిషేధిత జాబితాల్లో చూపిస్తున్నందున రైతులు కొత్త రుణాలు తీసుకునే అవకాశం లేకుండా పోయిందని, కావున ఖాతాలను నిషేధిత జాబితా నుంచి తొలగించి కొత్త రుణాలు ఇవ్వాలన్నారు. అలాగే పలువురు రైతులకు నేటికీ రుణమాఫీ జరగలేదని ఆరోపించారు. ప్రస్తుత సీజన్‌లో యూరియా కొరత ఉన్నందున రైతాంగానికి పూర్తిస్థాయిలో యూరియా అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేవరం వెంకటరెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు చందా చంద్రయ్య, మండల కార్యదర్శి డి.స్టాలిన్‌రెడ్డి, షేక్ సైదా, మల్లారెడ్డి, ఆర్.రామకృష్ణారెడ్డి, బోళ్ల కృష్ణారెడ్డి, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బచ్చలకూరి స్వరాజ్యం, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు గడ్డం వినోద్, కేవీపీఎస్ జిల్లా నాయకుడు సైదులు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

పాలకవీడు : మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో యూరియా అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయాధికారి బి. రాజు మంగళవారం తెలిపారు. పీఏసీఎస్ గోదాములో 2080 బస్తాల యూరియా ఉందన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో రవాణ సమస్య తలెత్తడం, బయట డీలర్లకు యూరియా సప్లై లేకపోవడంతో కొరత ఏర్పడిందన్నారు. ప్రభుత్వం పీఏసీఎస్‌లకు యూరియా సరఫరా అవుతుండటంతో కేంద్రాలకు రైతుల తాకిడి పెరిగిందని చెప్పారు.

అర్హులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

కోదాడరూరల్ : అర్హులైన వారందరూ ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని స్థానిక తహసీల్దార్ టి.సాయాగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19లోగా 01–10–2023 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని కోరారు. అదేవిధంగా ఓటరు జాబితాలో మీపేరు ఉందో లేదో తెలుసుకోవాలన్నా, సవరణలు ఏమైనా ఉంటే ఆన్‌లైన్‌లో లేక మీ సమీపంలోని బీఎల్‌ఓల వద్ద ఫారం–6 నింపి ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

కళా వేదిక నిర్మాణానికి శంకుస్థాపన



జోగు పిచ్చిరెడ్డి కళా వేదిక నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ సరోజనీపిచ్చిరెడ్డి

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జోగు పిచ్చిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'జోగు పిచ్చిరెడ్డి కళా వేదిక' నిర్మాణానికి మంగళవారం స్థానిక సర్పంచ్ జోగు సరోజనీపిచ్చిరెడ్డి, ఫౌండేషన్ కోశాధికారి జోగు అరవిందరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల నిర్మించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించే వజ్రోత్సవాల్లో భాగంగా సుమారు రూ. 6 లక్షల వ్యయంతో కళా వేదిక నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వజ్రోత్సవ కమిటీ ఉపాధ్యక్షుడు బిల్లా కనకయ్య, సహాయ కార్యదర్శి సుందరి నాగయ్య, ఉప సర్పంచ్ గండ్ర సైదిరెడ్డి, మాజీ సర్పంచ్ నందిపాటి సైదులు, కర్రి వెంకన్న, ప్రధానోపాధ్యాయులు యగ్గిడి వెంకటేశ్వర్లు, ఎం.సువర్ణ, పాఠశాల చైర్మన్ అరుణ, ఉపాధ్యాయులు సత్యం, కృష్ణారెడ్డి, సందీప్, శ్రీను, నాగమణి, అరుణశ్రీ, ఫకీర్, రవి, జానీ తదితరులు ఉన్నారు.

సాయుధ పోరాట వారోత్సవాలు ప్రారంభం



మునగాల : అమరవీరుల విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



మఠంపల్లి : కేవీ రాజ్ స్మారక స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

మునగాల : మునగాలలో వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా సాయుధ రైతాంగ పోరాట అమరులు పుచ్చలపల్లి సుందరయ్య, ఉప్పుల రామయ్య విగ్రహాలకు సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఎం మండల కమిటీ సభ్యుడు బోళ్ల కృష్ణారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బుర్రి శ్రీరాములు మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు దేవరం వెంకటరెడ్డి, మండల కార్యదర్శి చందా చంద్రయ్య, కార్యదర్శి వర్గ సభ్యుడు బచ్చలకూరి స్వరాజ్యం, వీరబోయిన వెంకన్న, జూలకంటి విజయలక్ష్మి, షేక్ సైదా, మండల కమిటీ సభ్యులు మండవ వెంకటాద్రి, ఉపేందర్, కృష్ణారెడ్డి, గడ్డం వినోద్, సైదులు, నాగరాజు, ఈదయ్య, వెంకన్న పాల్గొన్నారు.

సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమం

మఠంపల్లి : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికై ఉద్యమిద్దామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కంబాల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై గల అమరజీవి కేవీ రాజ్ స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి అమరారపు పున్నయ్య, హుజూర్‌నగర్ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు దాశరధి రామకృష్ణ, చాంద్, పెద్దజాన్, చిన్నజాన్, బాలసైదా, శ్రీనివాస్, సాంబా, వెంకటయ్య, మట్టయ్య, రామయ్య, ఫకీరా, అలీబాబా ఉన్నారు.

పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి



చిలుకూరు : ఎమ్మార్పీఎస్ నాయకులకు సంఘీభావం తెలుపుతున్న సర్పంచ్, నాయకులు



మునగాల : రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మునగాల : ఈనెల 18 నుంచి 22 వరకు జరిగే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు ఎల్.శ్రీనివాస్ మాదిగ కోరారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు మంగళవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టేలా ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కొత్తపల్లి అంజయ్య మాదిగ, మాతంగి ఏసుబాబు మాదిగ, తాళ్లపాక బాబు మాదిగ, కత్తి శ్రీను మాదిగ, ఆశోక్, వెంకట్ పాల్గొన్నారు.

కోదాడరూరల్ : పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారం నాల్గవ రోజుకు చేరుకుంది. ఈ దీక్షకు టీడీపీ నాయకులు సంఘీభావం ప్రకటించారు. పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి మాదిగలకు న్యాయం చేయాలని టీడీపీ నాయకుడు ఓరుగంటి ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనపనేని కృష్ణారావు, సాతులూరి గుర్వయ్య, వేమూరి సురేష్, ఏపూరి రాజుమాదిగ, గంధం కోటయ్య, పంది లక్ష్మయ్య, సత్యరాజు మాదిగ, ఏసోబు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

చిలుకూరు : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ చిలుకూరులోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన నిరసన దీక్ష మంగళవారం రెండో రోజు కొనసాగింది. ఈ దీక్షకు సర్పంచ్ కొడారు బాబు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు వడ్డేపల్లి కోటేష్ మాదిగ, మండల ఇన్‌చార్జ్ మల్లెపంగు సూరిబాబు, నాయకులు సిద్దెల శ్రీను, వడ్డేపల్లి రామకృష్ణ, లచ్చయ్య, బాలు, వీరబాబు, సైదులు, సిద్దు, చిరంజీవి, శంకర్ , విశాల, గోపి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించాలి

నడిగూడెం : పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరిస్తూ బిల్లును ప్రవేశపెట్టాలని మహాజన సోషలిస్టు పార్టీ మండల అధ్యక్షుడు మిట్టగణపుల మోష కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాసాని కిషోర్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



హుజూర్‌నగర్ : క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

హుజూర్‌నగర్ : విద్యార్థులు చదవుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, బి.జగన్ నాయక్ అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలను వారు ప్రారంభించారు. కాగా 14,17 ఏళ్ల బాలబాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓలు సైదానాయక్, చత్రునాయక్, హెచ్‌ఎంలు ఉదయశ్రీ, అబ్దుల్ లతీఫ్, రాధాదుర్గ, క్రీడల ఇన్‌చార్జ్ సీతారాంరెడ్డి, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలతో ఐక్యత

నడిగూడెం : క్రీడలు ఐక్యతకు దోహదపడతాయని స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శోభన్‌బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఆటల పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆటల పోటీల్లో గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సామినేని శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, వ్యాయామ ఉపాధ్యాయులు గడ్డం వెంకటేశ్వర్లు, పాతకొట్ల ప్రకాష్, సరళాదేవి, సునీత, శైలజ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ అధిక ధరకు విక్రయించడంపై నిసరన



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

చిలుకూరు : గ్యాస్ బండలు అధిక ధరకు విక్రయించడంపై చిలుకూరు గ్రామస్తులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. చిలుకూరులో గ్యాస్ బండలు విక్రయించడానికి వచ్చిన కోదాడ పట్టణానికి చెందిన శ్లోకా ఇండియన్ గ్యాస్‌కు చెందిన వ్యక్తితో ఘర్షణకు దిగి గ్రామంలో అధిక ధరకు గ్యాస్ బండలు అమ్మడానికి వీల్లేదని వాహనాన్ని పంపంచివేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ ఒక్కో గ్యాస్ బండపై సుమారుగా రూ.200 అదనంగా తీసుకుంటున్నారని ఆరోపించారు. ఇదేమిటని ప్రశ్నిస్తే వారు వాగ్వాదానికి దిగుతున్నారని అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు కొండా కోటయ్య, చిలువేరు ఆంజనేయులు, గింగిరెడ్డి రవీందర్‌రెడ్డి, పుట్టబంతి వెంకటి తదితరులు పాల్గొన్నారు.

17న కాంగ్రెస్ విజయభేరి సభ

మునగాల : హైదరాబాద్‌లోని తుక్కుగూడలో ఈ నెల 17న టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించే విజయభేరి సభను జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు మండవ చంద్రయ్య మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

కోదాడరూరల్ : పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చందర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని వాగ్దేవి కళాశాలలో స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని విద్యార్థులతో సంతకాలు సేకరించి మాట్లాడారు. ప్రభుత్వ గురుకులాలు, హాస్టల్స్‌లో విద్యార్థులకు కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రమీల, సుశీల, గౌతమి, షర్మిల, రాఘవ్, ప్రశాంత్, సుధాకర్, ప్రభు తదితరులు ఉన్నారు.

మూసీఒడ్డుతండాకు రోడ్డు వేయాలి



మూసీఒడ్డుతండా రోడ్డును పరిశీలిస్తున్న బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ రాపోలు నవీన్‌కుమార్

నేరేడుచర్ల : మండలంలోని పుల్లంబండతండా గ్రామ పంచాయతీ పరిధిలోని మూసీ ఒడ్డుతండాకు బీటీ రోడ్డు వేయాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ రాపోలు నవీన్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని మూసీ ఒడ్డుతండా రోడ్డును పరిశీలించి మాట్లాడారు. రామగిరి నుంచి రామకృష్ణతండా మీదుగా మూసీ ఒడ్డుతండాకు రెండున్నర కిలో మీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మిస్తే తండా ప్రజలు, విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు రామస్వామి, రవి, నాగులు, శంకర్, భిక్షం, శ్రీను, కమల, సైదమ్మ, నాగు, పార్వతి తదితరులు ఉన్నారు.

బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

నడిగూడెం : ఈ నెల 18 నుంచి 22 వరకు జరగబోయే ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ ధూళిపాల ధనుంజయ్ నాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభా ప్రకారం 56 శాతం ఉన్న బీసీల కోసం ప్రత్యేక బిల్లును ప్రవేశపెట్టాలన్నారు. బీసీ బిల్లు కోసం బీసీ ప్రజాప్రతినిధులు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు ఇనుగుర్తి వెంకటరమణాచారి, సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నిగిడాల వీరయ్య, మండల అధ్యక్షుడు యలగొండ నాగేశ్వరరావు, నాయకులు మండవ నాగమణి, సతీష్ తదితరులు ఉన్నారు.

విద్యాదానం మహాదానం



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న వాసవీ క్లబ్ నిర్వాహకులు

కోదాడ : విద్యాదానం మహాదానమని వాసవీ క్లబ్ అధ్యక్షుడు ఇమ్మడి సతీష్ అన్నారు. మంగళవారం కోదాడ వాసవీ భవన్‌లో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎంసెట్, జెఈఈ మెయిన్ పరీక్షల మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని అన్నారు. కార్యక్రమంలో శేకు శ్రీనివాసరావు, వెంపటి ప్రసాద్, చల్లా విజయశేఖర్, పబ్బా గీత, యాధా రాణి, జగిని ప్రసాద్, చాల్ల లక్ష్మీనర్సయ్య, బండారు శ్రీనివాసరావు, గెల్లి చక్రధరరావు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే అవార్డులు

మునగాల : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందిన స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు షేక్ జాఫర్‌ను మంగళవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు డి.సీతారామరాజు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ అంకితభావంతో పనిచేస్తే అవార్డులు వస్తాయని, జాఫర్ భవిష్యత్‌లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జాఫర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బీఆర్ఎస్ కార్యకర్తలకే పథకాలు

మోతె : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకే అందుతున్నాయని డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు ఎలుగు మధు చేగువీర ఆరోపించారు. మంగళవారం రావిపహాడ్‌లో నిర్వహించిన డీవైఎఫ్ఐ గ్రామ శాఖ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గృహలక్ష్మి, దళితబంధు, డబుల్ బెడ్ రూం ఇళ్ల పథకాలలో బీఆర్ఎస్ కార్యకర్తలే లబ్ధి పొందడం అన్యాయమన్నారు. డీవైఎఫ్ఐ నాయకులు శీలం సతీష్, నాగయ్య, సైదులు పాల్గొన్నారు.